15

# నీ వెనుకే నీ నీడ

అప్పుడే లోకల్ బస్సు దిగాడు రాజారాం.

సన్నగా తుంపర రాలుతోంది. రోడ్డుమీద మనుషులెవ్వరూ నడవడంలేదు. అంతకుముందు రెండుమూడు రోజుల నుండి వరుసగా ముసురులో తడుస్తున్నది సిటీ అంతా. యిండ్లూ, రోడ్లూ అన్నీ వానలో నానినట్లు అదోరకంగా తేమగా, చెమ్మగా ఉంది వాతావరణం.

ఎక్కడో రాయచూర్ నుండి హైద్రాబాద్ వచ్చి, హైద్రాబాద్ నుండి వరంగల్‌కు బస్సులో వచ్చి... యిప్పుడు లోకల్‌లో దిగి..

ఎక్కడి రాయచూర్-ఎక్కడి వరంగల్.. ఓహ్.

రాజారాంకు ఊరంతా కొత్తగా ఉంది. సిటీలో ఎంతో మార్పొచ్చింది. యీ ఐదారేళ్ళ తర్వాత తిరిగొస్తే అంతాకొత్తగా, వింతగా అనిపిస్తోందతనికి.

కాని - యిన్నాళ్ళకు తను పుట్టిన ఊరుకు, తన స్వంత ఊరుకు వచ్చి- మందనుండి తిరిగొచ్చిన ఆవు యింటి దగ్గరున్న దూడను తడిమి తడిమి చూచుకున్నట్టు ఆకాశాన్నీ, చుట్టూ గాలినీ, కొత్తగా పుట్టుకొచ్చిన బిల్డింగులను, యింకా కూలిపోకుండా నిలబడి ఉన్న పాత భవనాలనూ చూస్తూ నిలబడ్డాడు సంతోషంగా.

చినుకులు యింకాస్త ఎక్కువైనాయి. -

తడుస్తూ యింటికిపోదామా, యింకాస్సేపు అలాగే నిలబడి పోదామా అని ఆలోచిస్తున్నవాడల్లా గబుక్కున ఏదో తోచినట్టు చేతిలోని సూట్‌కేస్‌తో ఎదురుగా ఉన్న మదీనాకేఫ్‌లోకి చొరబడ్డాడు.

“యీ హోటల్ మాత్రం ఏమీ మారలేదు”.

తను వరంగల్‌లోనే ఉంటున్నప్పుడు రోజూ ఈ హోటల్లోనే ఛాయ్ తాగేవాడు. యిక్కడి టీ తాగడమంటే తనకు ఎంతో యిష్టంగా ఉండేది.

“బోలియే సాబ్”

తలెత్తాడు రాజారం. ఎదురుగా సర్వర్.

“ఏక్ ఛాయ్.”

కథా నిలయం

"ఏక్ ఛాయ్‌లావ్"

"అప్‌కో సాబ్"

"వన్‌బై టూ ఛాయ్" ప్రక్క టేబుల్ దగ్గరున్న మనిషి ఆర్డర్.

"దో ఛాయ్ లావ్"

"అప్‌కో" యింకొకరిని అడుగుతున్నాడు.

"త్రీ బై ఫోర్ పోనే"

"పాంచ్ ఛాయ్ లావ్" అరిచాడు బిగ్గరగా

పాంచ్ ఛాయ్ లావ్- అంటే ఐదు ఛాయ్‌లు తీసుకురా అని అర్థం. కాని ఆ ఛాయ్‌లను ఎవడూ తీసుకురాడు. తీసుకురా అని అరుస్తున్న వీడే వెళ్ళి తీసుకొస్తాడు కప్పులన్నింటినీ. మరి అలాంటప్పుడు 'లావ్' అని అరవడమెందుకు. రాజారాంకు నవ్వొచ్చింది. తను యిదివరలోకూడా యీ హోటల్లో టీ తాగుతున్నప్పుడు యిలాగే ఆలోచిస్తూండేవాడు. యిప్పుడుకూడా మళ్లీ-

యింకో రెండు నిముషాలు గడిచింది. ఛాయ్ యింకా రాలేదు.

ఎవరో కుర్రాడువచ్చి రాజారాం ముందరి రాతి టేబుల్‌ను తడిగుడ్డతో శుభ్రం చేస్తున్నాడు సీరియస్‌గా.

చంకలో ఎంగిలికప్ సాసర్‌లతో నిండిన ట్రే... చిరిగిపోయిన కాకి నిక్కరు, నల్లగా మసిగుడ్డలాంటి బనీను... నూనెలేని చింపిరిజుట్టు... కాని తెల్లగా శరీరం.

పిల్లవాడు చూడ్డానికి ఎంతోముద్దుగా ఉన్నా... అందంగా ఉన్నా, అతని వేషం... సినిమాల్లో కోటీశ్వరుని కొడుకు క్లీనర్ వేషమేసినట్లనిపించింది.

తదేకంగా ఆ పిల్లవాని వంకచూస్తూ ఉండిపోయాడు, రాజారాం. ఎందుకో అతనికి ఆ పిల్లవానిపై జాలేసి, ముద్దొచ్చి-

పాపం...యింత చిన్న వయసులోనే క్లీనర్‌గా పనిచేయాల్సిన అవరసమేమొచ్చిందో.. తల్లిదండ్రులులేరో.. ఉన్నా... తండ్రి తాగుబోతై, తల్లి రోగై అలాంటి వాతావరణం ఏర్పడిందో... లేకుంటే హాయిగా ఆడుతూ పాడుతూ గడపాల్సిన బంగారు బాల్యాన్ని యీ ఎంగిలి సాసర్ల నడుమ సేఠ్ గదమాయింపుల నడుమ... ప్చ్,

వీళ్ళా భావి భారత పౌరులు... సైకిల్ షాపుల్లో, బూట్‌పాలిష్ గాండ్లుగా, మోటార్ గ్యారేజీల్లో హోటల్లలో, రోడ్లవెంబడి అడుక్కుంటూ- ఎందరు.. ఎందరు యీ దేశంలో, శాపగ్రస్తుల్లా, దురదృష్టవంతులుగా, కనీస సౌకర్యాలకైనా నోచుకోని దౌర్భాగ్యులుగా బ్రతుకుతున్న వీళ్ళ యీ స్థితికి కారకులెవరు. ఎందుకు వీళ్ళిలా తయారవుతున్నారు. ఎవరు వీళ్ళ గురించి పట్టించుకుంటున్నారు.

ప్చ్-ఏమోఅంతా...అయోమయం.. టేబుల్ క్లీనింగ్ ఐపోయింది..పిల్లవాడు వెళ్ళిపోతున్నాడు.

కాని...వాణ్ని తను యిదివరలో ఎక్కడో చూచినట్టు... యిదివరకే వాడు తనకు పరిచయమున్నట్టు... ఎందుకో అదోరకంగా అనిపిస్తోంది తనకు...ఎందుకు... ఎందుకు.

ఛాయ్ తెచ్చాడు సర్వర్.

తాగి బయటకొచ్చి బిల్లుచెల్లించి... యింకా క్లీన్ చేస్తున్న పిల్లవాన్ని మరో సారి జాలిగా చూసి రోడ్డుమీది కొచ్చాడు రాజారాం.

తుంపర తగ్గింది

జనం మళ్ళీ చీమల్లా పరుగెత్తుకొస్తూనే ఉన్నారు బయటికి.

లక్ష్మీ టాకీస్ సందులోనుండి నడుస్తున్నాడు వడివడిగా.

ఇంకో రెండో ఫర్లాంగులు నడుస్తే తన అత్తవారి యిల్లొచ్చి-

అది తన అత్తవారి ఇల్లా... కాదు కాదు... మాజీ అత్తవారి యిల్లు.

రాజారాం ముఖం చటుక్కున రంగు మారి... కందగడ్డలా ఐ... గుండెల్లో నుండి వణుకు ప్రారంభమైంది.

ఇప్పుడా ఇంట్లో వాతావరణం ఎలా ఉంటుందో... ఇదివరకు తన భార్య రేవతి బ్రతికుండగా- అత్తవారింటికెళ్తే తన అత్తా మామా తనను దేవునిలా చూచుకునే వారు. ఆ యిల్లు పూలపందిరిలా కలకలలాడేది. అక్కడ ఒక్కోక్షణం ఒక్కో అమృత ఘడియలా -

ఓహ్...

కాని రేవతి చచ్చిపోయి... తనకు పుట్టిన ఒక్కగానొక్క కొడుకు మిగిలి పోయి... జీవితం చిన్నాభిన్నమై.. ఎదురుగా కళ్ళనిండా చీకటి ముంచుకొచ్చి.

తన మెదడు మొద్దుబారిపోయింది. మనస్సు తిమ్మిరెక్కి పోయింది.

ఏం జేయాలి తను... ఏం జేయాలి తను.

ఏదో చేయాలి అని అనుకుంటుండగానే స్త్రీ వ్యామోహం, పిచ్చి తనను మత్తులా అవహించి, వెనకాముందూ ఆలోచించుకోకుండా, ఎవరి సలహానూ పాటించకుండా సీతను మళ్ళీ పెళ్లిచేసుకుని- కొత్తకాపురం పెట్టి.

కొద్దిరోజుల్లో సీత తాటకిలాంటిదని స్పష్టంగా అర్థమైంది తనకు.

భార్య గయ్యాళయితే సంసారం యెలా నరకంగా తయారవుతుందో అనుభవంలో కొచ్చింది. ఆమె నోటికి భయపడి... ఆమెను ఏమీ అనలేని బలహీనతతో కొట్టు మిట్టాడి - వరంగల్‌ను వదలిపెట్టాడు తను సీత పోరుమీద.

వెంబడున్న రామును ఏంజేయాలన్నది సమస్య... నిజానికి ఆ సమయంలో రాము గురించి తను పెద్దగా ఆలోచించలేదు. సీత తత్వం ఎలాంటిదైనా మనిషి ఎంతో అందంగా వుండడం మూలాన ఆమె అందం తప్పితే తనకు ప్రపంచం కనబడలేదప్పుడు-ఎప్పుడూ సీత కళ్ళు... సీత పెదవులు.. సీత వయ్యారి నడక... నడుస్తుంటే ఊగిన నడుం - అవేలోకం అదే మత్తు.

సరిగ్గా - ఆ సమయంలో రామును తను పెంచుతానన్నాడు మాజీ మామ.

ఎవరన్నా పెంచనీ, ఏమైనగానీ... సీతతో గడపడం.. ఆమె చెప్పినట్టు చేయడం అదే అప్పుడు తన తపన.

ఆ పరిస్థితిలో - రాముని యిక్కడే వరంగల్‌లో వదిలేసి... సీతతో తను రాయచూర్ వెళ్ళిపోయి... గుమాస్తాగా స్థిరపడి బావిలో కప్పలా ఐదేండ్లు గడిపాడు.

ఈ ఐదేండ్లలో వరంగల్‌కు ఎన్నడూ రాలేదు తను. ఇక్కడ రాము ఎలా వుంటున్నాడు... ఏంజేస్తున్నాడు... అత్తా మామ ఏమైపోయారు... యివేం తెలియదు. ఏ ఐదారుసార్లో ఉత్తరం ముక్కలు రాసిపారేశాడుపొడిపొడిగా.

కాని... మొన్నమొన్న సీత యింకా మితిమీరిపోయి "యీ గుమాస్తా మొగుడితో వుంటే నాకేం సుఖంలేదు'. అని తనతో ముఖాముఖిగా కయ్యంపెట్టుకుని వున్న నాల్గు డబ్బులతో ఎవనితోనో లేచిపోయింతర్వాత.

లోకం మళ్ళీ కొత్తగా, కొత్తరకంగా తెర తొలిగిన బొమ్మలా సాక్షాత్కరించి.. రాము... అత్తా మామా.. వరంగల్ .... తాగిన మనిషి మత్తు వదిలింతర్వాత బద్ధకంగా మేల్కొనట్టు కళ్లుతెరిచి చూస్తే- సిగ్గనిపించింది రాజారావుకు

వెంటనే ఓ కార్డుముక్క రాసేసి బయలు దేరి-

నడుస్తున్నాడు గబగబా.

అత్తవారి యిల్లొచ్చింది.

వాకిట్లో నిలబడి పిలిచాడు "రామూ రామూ" అని.

జవాబు రాలేదు లోపలినుండి. అసలు మనుషుల అలికిడేలేదు లోపల.

యిల్లు కొద్దిగా పాతబడి... చూరు క్రిందికి వంగిపోయి.. గోడకున్న గిలాబు బిచ్చలు బిచ్చలుగా రాలిపోయి- యిది వరకు పౌడర్ వేసుకున్న ముఖంలా ఉన్న యిల్లు యిప్పుడు స్ఫోటకం గుంటలుపడ్డ ముఖంలా తయారై-

"రామూ-"మళ్లీ పిలిచాడు.

లోపలినుండి ఓ ముసలాయన నడుస్తూ బయటకొచ్చి... పరిశీలనగా చూచి "నువ్వా... రా... రా కూర్చో" అన్నాడు.

గుమ్మందగ్గరే ఉన్న కర్రకుర్చీలో కూర్చుని యింట్లోకి చూశాడు రాజారాం కళ్ళతో వెదుకుతూ.

"రాముకోసం చూస్తున్నావుకదూ"

"ఔను... వాడేడి"

"వస్తాడు యిప్పుడే"

చూడాలి... చూడాలి... ఆరాటం... ఆరాటం... ఎలా ఉన్నాడో వాడిప్పుడు పెద్దవాడై ఉంటాడా-

"అత్తమ్మేది-"

"ఆమె పోయి రెండేళ్ళయింది."

సిగ్గనిపించింది రాజారాంకు. ఆ విషయాన్ని కూడా తను తెలుసుకోకుండా పూర్తిగా పరాయిమనిషై పోయినందుకు. నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

అత్త పోయినందుకు అతను ఏమాత్రం బాధ పడలేదు. రాము కోసం చూస్తున్నాడు అతురతగా.

పావుగంటయింది.

"ఎక్కడికెళ్ళాడు వాడు"

"హోటల్‌కు"

"ఎందుకు"

"పని చేయడానికి"

"ఏంపని?"

"క్లీనర్‌గా"

"క్లీనర్‌గానా-" తనకొడుకు హోటల్లో క్లీనరా... క్లీనర్... క్లీనర్... ఛీ ఛీ-"

"వాన్ని క్లీనర్‌ను చేయడానికి నీకు సిగ్గులేదూ-" అన్నాడు ఆవేశంగా.

ముసలాయన మాట్లాడలేదు. నవ్వాడు చిన్నగా.

ఆ నవ్వు నిశ్శబ్దంగా తన గుండెల్లో మంటల్లా... జ్వాలలా-

"చెప్పవేం..." అరిచాడు కోపంగా.

"................"

"నువ్వూ... నీలాంటి వాళ్ళు చేయబట్టే యీ దేశంలో పిల్లలు వాడినపూలలా... ఏ దిక్కూ లేని క్లీనర్లూ, బిచ్చగాండ్లూ ఐపోతున్నారు." రాజారాంకు తను ఏమ్మాట్లాడుతున్నాడో తెలియడంలేదు.

"కనీసం తాతలాంటి వాళ్ళతో యిలా క్లీనర్‌గానైనా బ్రతుకుతున్నారు... నీలాంటి తండ్రుల చేతుల్లో బ్రతుకుతే రామూలాంటి ఈ దిక్కుమొక్కులేని పిల్లలు ఎప్పుడో చచ్చిపోయే వాళ్ళు. యిన్నాళ్ళూ కన్న కొడుకును కూడా పట్టించుకోకుండా ఎక్కడో ఎవతెతోనో కులికిందిచాలక యిప్పుడొచ్చి తాతను సిగ్గులేదా అంటున్నావ్. అసలు సిగ్గూ, షరమ్‌లేని మనిషివి నువ్వు. గెటవుట్... బాహర్ చలేజావ్ యహాసే." వెనుకనుండి తుపాకీ తూటాల వంటి మాటలు

వెనక్కితిరిగాడు-

గుమ్మంలో ... అప్పుడు తను మదీనాకేఫ్‌లో చూచిన క్లీనర్... కాకినిక్కర్.. మాసిన బనీను.... తన కొడుకు

"చలేజావ్ బాహర్" తన కొడుకు యింతకు ముందన్న మాట -

రాజారాం తలలో డైనమైట్లు ప్రేలుతున్నాయి.

సిగ్గుతో చచ్చిపోతున్నాడతను.... ఆ క్షణంలో -

'స్వాతి' మాసపత్రిక
ఏప్రిల్ 1978